# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 232వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం ప్రారంభమైంది.**

**2.** **కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విశాఖపట్నంలో ఈరోజు పర్యటిస్తారు.**

**3.** **ఉత్తరాంధ్రాలో భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని హెూం మంత్రి వి.అనిత అధికారులను ఆదేశించారు .**

**4.** **నూతన పారిశ్రామిక విధానం వల్ల ఇంజినీరింగ్ ఉత్పత్తులు విదేశాలకు అధికంగా ఎగుమతి అవుతాయని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**

**5.** **త్వరలో విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**

==========================

విశాఖపట్నంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు పర్యటిస్తారు. ఐఎన్ఎస్ ఉదయగిరి, హిమగిరి యుద్ధనౌకలను ఈ మధ్యాహ్నం ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

--------------------------

అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 232వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం ఈ మధ్యాహ్నం ప్రారంభమైంది. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, ఎస్‌హెచ్‌జీ రంగాలకు రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై సమీక్ష జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంబడి అల్పపీడనం ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. రానున్న రెండు రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి ఇది మరింత బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

---------------------------

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని హోం మంత్రి వి.అనిత అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్రలో కురుస్తున్న వర్షాలపై విశాఖపట్నంలో ఈరోజు ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని దిశా నిర్దేశం చేశారు. సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.

మరోవైపు మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మత్స్య కారులను సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.

---------------------------

ప్రభుత్వం అమలు చేస్తోన్న నూతన పారిశ్రామిక విధానంవల్ల ఇంజినీరింగ్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అయ్యే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడలో కేంద్ర వాణిజ్య పరిశ్రమ మంత్రిత్వ శాఖ, ఇంజినీరింగ్ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఈఈపీసీ) ఆధ్వర్యంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి అత్యుత్తమ పనితీరు, ఎక్కువ ఎగుమతులు చేసిన ఇంజినీరింగ్ ఉత్పత్తుల పరిశ్రమలకు పురస్కారాల ప్రదానోత్సవం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతదేశం నుంచి 2024–25 సంవత్సరంలో జరిగిన మొత్తం ఎగుమతుల్లో 26 శాతం ఇంజినీరింగ్ ఉత్పత్తులే ఉన్నాయని, అందులో దక్షిణాది రాష్ట్రాల నుంచే 32 శాతం ఉండడం అభినందనీయమని మంత్రి తెలుపుతూ..

వాయిస్…30 సెకన్లు

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడానికి సింగిల్ విండో విధానంలో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్‌లోని సమితి కార్యాలయంలో గణేష్ ఉత్సవ గీతాలు, వెబ్ సైట్ ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వడం హర్షణీయమని అన్నారు. పర్యావరణ రహితంగా విగ్రహాలు ఏర్పాటు చేయాలని మంత్రి కోరుతూ..

వాయిస్…18 సెకన్లు

---------------------------

మదర్ థెరిసా మహోన్నత మానవతావాది అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా సామాజిక మధ్యమం ఎక్స్ వేదిక ఆయన నివాళులర్పించారు. పేదలు, రోగులు, అనాథలకు అమ్మగా నిలిచి సేవలందించారని కొనియాడారు. కరుణామయి త్యాగనిరతిని స్మరించుకుంటూ ప్రజాసేవకు స్ఫూర్తిని పొందుదామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

---------------------------

కోస్టారికాలో జరుగుతున్న జూనియర్, సబ్ జూనియర్ క్లాసిక్, ఎక్విప్ మెంట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్

షిప్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన క్రీడాకారిణి షేక్ సాదియా అల్మాస్ మూడో స్థానంలో నిలిచింది. మహిళల 57 కిలోల విభాగం ఓవరాల్ ఛాంపియన్ షిప్‌లో కాంస్యం, డెడ్ లిఫ్ట్ విభాగంలో రజత పతకం సాధించింది.

మరో వైపు గుజరాత్ లో జరుగుతున్న కామన్ వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి రెడ్డి భవానీ సిల్వర్ మెడల్ సాధించింది. వీరికి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ రవి నాయుడు అభినందనలు తెలిపారు.

---------------------------

త్వరలో విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన గత రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజల నీటి కష్టాలు తీర్చుతామని స్పష్టం చేశారు. మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

అనంతపురం జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నిన్న జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం హంద్రీ నీవా కాలువ వెడల్పు పనులను 100 రోజుల్లో పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించడం గొప్ప కార్యక్రమమని మంత్రి పేర్కొంటూ..

వాయిస్..33 సెకన్లు

---------------------------

ఉపాధ్యాయ పోస్టులకు నిర్వహించిన డీఎస్సీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి లాగిన్ ఐడీల ద్వారా ఈరోజు మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే ముందు వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అభ్యర్థులకు సూచించారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 551 పాయింట్ల నష్టంతో 81 వేల 84 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 164 పాయింట్ల నష్టంతో 24 వేల 803 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఇండియన్ హ్యాండ్ మేడ్ తో తయారైన చేనేత, హస్తకళలకు ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చేనేత, హస్తకళల అభివృద్ధి గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్ల తెలిపారు. విజయవాడలో "గాంధీ బునకర్ మేళా"ను ఆమె నిన్న ప్రారంభించారు. అనంతరం సుచిత్ర ఎల్ల మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ వస్తువులకు ఆదరణ ఎలా తీసుకురావాలనే అంశంపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. మన కళలను, ఆర్టిజన్స్‌ను, హ్యాండీ క్రాఫ్ట్స్‌ను అభివృద్ధి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

======================